పంటలను పరిశీలిస్తున్న ఏఈవో లలిత

పంట సాగుపై డిజిటల్ సర్వే

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8 : కేంద్ర ప్రభుత్వం పంటల సాగుపై చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా శనివారం మండలంలోని కందికట్కూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని రంగపేట గ్రామంలో డిజిటల్ సర్వే నిర్వహించామని పొత్తూరు క్లస్టర్ ఏఈవో లలిత అన్నారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ, రంగపేట గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రతి సర్వే నంబర్‌లో కేడస్ట్రీయల్ మ్యాప్ ద్వారా డిజిటలైజేషన్ చేశామన్నారు. ప్రతి సర్వే నంబర్ నుంచి 20 మీటర్ల దూరం లోపు మాత్రమే పంట నమోదు చేశామన్నారు. కందికట్కూర్ రెవెన్యూ పరిధిలో మొత్తం 2719 ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే కోసం 1800వేల ఎకరాలను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

అన్నదానం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8 : వికాస తరంగిణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వాహకులు శనివారం సిరిసిల్లలోని ప్రభుత్వ దవాఖానలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి నిత్యాన్నసేవా కేంద్రంలో దవాఖానలోని రోగుల అటెండెంట్లకు వందమందికిపైగా అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. ఇక్కడ వికాస తరంగిణి బృందం సభ్యులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో తిమ్మనగరం మల్లయ్య కుటుంబాన్ని సిరిసిల్ల నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పరామర్శించారు. మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ మేరకు శనివారం సంఘ సభ్యులు పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. అధ్యక్షుడు సమ్మెట శ్రీనివాస్, సభ్యులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జకోటియా పెట్రోల్ బంక్ ఎదురుగా గల 212.చ.గజాల ప్లాట్ అమ్మకానికి/లీజుకి కలదు. సంప్రదించండి : సెల్ : 83280 30686, 94400 15501
NTK-335675

CHANGE OF NAME
Bura Maruthi, S/o. Mallesham, H.No. 1-2-7, Ambhikanagar, Sircilla Town, Rajanna Sircilla Dist, Pin. 505301, here by Declared I have changed my son Name from BURA SHIVANSH VIRAT (old) to BURA LAVITH (New)

CHANGE OF NAME
★Gunnala Rajitha, W/o Gunnala Vijay Kumar, my Daughter Name Gunnala Vithika, H.No. 1-52, Satharam, Mallapur mandal, Jagitial Dist, my Daughter Name was changed to Gunnala Manvika.
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- చిన్న బోనాల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయం తనిఖీ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహాన్ని పరిశీలించారు. కిచెన్, స్టోర్ రూంకు వెళ్లి సరుకుల నాణ్యత, ఆహార పదార్థాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులు చదువుతుండగా వెళ్లి పరిశీలించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తి అయిందని ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం రివిజన్ చేయిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపేలా సిద్ధం చేయాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పక్కా ప్రణాళిక ప్రకారం.. ముందుకు వెళ్లాలన్నారు. హాస్టల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్
- సీఐటీయూ కార్యాలయంలో బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశం

మాట్లాడుతున్న నాయకులు మూశం రమేశ్

కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ. 4 వేల పింఛన్ అమలు చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మూశం రమేశ్ మాట్లాడుతూ, బీడీ కార్మికులకు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రతి బీడీ కార్మికురాలికి నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని మరిచిపోయిందన్నారు. ఇప్పటికి కూడా అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉత్తర తెలంగాణలో లక్షలాది మంది కార్మికులు బీడీ కార్మికులు పని చేస్తున్నారని, జిల్లాలో 90వేల మంది కార్మికుల బీడీ పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్నాయన్నారు. కొంత కాలం నుంచి బీడీ పరిశ్రమ యజమానులు కార్మికులకు పని తగ్గించి ఇస్తున్నది నెలకు వారం, పది రోజులకు కూడా పని దొరకని పరిస్థితి నెలకొందన్నారు. బీడీ కార్మికుల బేసిక్ వేతనాలు పెంచాలన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం రూ. 4వేల పెన్షన్ అందిస్తే బీడీ కార్మిక కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని లేకుంటే బీడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బీడీ యూనియన్ జిల్లా నాయకులు సూరం పద్మ, జిందం కమలాకర్, దాసరి రూప, బెజిగం సురేశ్ పాల్గొన్నారు.

సెస్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్ వినియోగదారులు రాబోవు వేసవికాలం, వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు సెస్ ఎండీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు గమనించి, ఏదైనా సమాచారం, ఫిర్యాదుల కోసం సంబంధిత మండల ఏఈలను సంప్రదించాలని కోరారు. సిరిసిల్ల పట్టణ టౌన్-(1)9440814063, సిరిసిల్ల పట్టణం టౌన్ (2) 9440814072, తంగళ్లపల్లి 9440814074, వేములవాడరూరల్ 9440514073, వేములవాడ టౌన్ 9440814075, వేములవాడ అర్బన్ 9154280470, బోయినపల్లి 9440814076, చందుర్తి 9440814077, రుద్రంగి 9154280478, కోనరావుపేట 9408140078, ముస్తాబాద్ 9440814079, ఇల్లంతకుంట 9440814080, ఎల్లారెడ్డిపేట 9440814081, వీర్నపల్లి 9154280403, గంభీరావుపేట 9440814082కు ఫిర్యాదు చేయాలన్నారు.

రైతులకు సరిపడా యూరియా ఉంది

జిల్లా సహకార అధికారి రామకృష్ణ

కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా సహకార అధికారి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా సహకార అధికారి రాజన్నసిరిసిల్ల ఆధ్వర్యంలో శనివారం 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులను ఎరువుల విక్రయాలపై ప్రత్యక్షంగా వివరణ కోరినట్లు తెలిపారు. క్రమపద్ధతిలో ఎరువుల విక్రయాలపై క్యూ పద్ధతిని పాటిస్తున్నామని, సంఘాల్లో ఎలాంటి యూరియా కొరత లేదని వివరణ ఇచ్చారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ ఎరువులు నిల్వ ఉంచుతూ సరఫరా చేస్తామని తెలిపారన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని సంఘాలు, ప్రైవేట్ సంస్థలకు కూడా యాసంగికి సరిపడా యూరియా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారని ఈ సందర్భంగా వెల్లడించారు.

కొలనూర్‌లో గోదాం నుంచి యూరియా బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

యూరియా వచ్చేసింది

- యూరియా కొరత తీర్చిన అధికారులు
- 'మస్తే' కథనానికి స్పందన

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని కొలనూర్ సింగిల్ విండో పరిధిలో యూరియా కోసం రైతుల పడిగాపులు అనే కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయాధికారి చొరవ తీసుకొని లారీలో 400 బస్తాల యూరియాను పంపించారు. దీంతో రైతులు తమకు అవసరమున్న మేర యూరియాను తీసుకెళ్లారు. అంతేకాకుండా గోదాంలో యూరియా నిల్వ ఉండేలా మరో లారీ లోడ్‌ను తెప్పించినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఎరువుల బాధలు తీరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ దవాఖాన



దవాఖాన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఎంసీ చెర్మన్ తిరుపతి, నాయకులు

రుద్రంగి, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ దవాఖాన త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న దవాఖాన నిర్మాణ పనులను నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమాన్ ఆలయం మీదుగా ఇందిరా చౌక్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. కోటి 50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాయకులు కొమురె శంకర్, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, నారాయణ, లింగం, మహేశ్ ఉన్నారు.

శిలాఫలకాలకు ముసుగు

శిలాఫలకాలకు ముసుగు వేస్తున్న అధికారులు

చందుర్తి, ఫిబ్రవరి 8: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు, గోడ మీద రాతలు వంటివి ఉండకూడదు. దీంతో అధికారులు శనివారం మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడకు ఉన్నటువంటి శిలాఫలకాలకు ముసుగువేశారు. ప్రచార ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో మంత్రులు, సీఎం చిత్రపటాలకు ముసుగువేశారు. ప్రకటనలు తొలగించే పనిలో సిబ్బందితలమునకలయ్యారు.

యువ చైతన్య ఫౌండేషన్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని మరిమడ్ల గ్రామానికి చెందిన జింక శ్రీనివాస్ యువచైతన్య దీపం ఫౌండేషన్ మండలాధ్యక్షుడిగా నియామకమయ్యారు. పౌండర్ సేనాపతి కొట్టపల్లి శేఖర్ అధ్వర్యంలో శ్రీనివాస్‌కు నియమాక పత్రాన్ని అందజేసి, శాలువాతో సన్మానించారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనల మేరకు నిర్మాణం చేయాలి

రైస్‌మిల్లుకు హద్దులు నిర్ణయిస్తున్న పంచాయతీ అధికారులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8 : మండల కేంద్రం శివారులో నిర్మాణమవుతున్న రుద్ర శివ రైస్ మిల్లుపై కొందరు రైతులు అభ్యంతరం తెలుపుతూ అధికారులను ఆశ్రయించగా, నిబంధనల మేరకు.. రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టాలని అధికారులు మిల్లు నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం డీఎస్‌వో వసంతలక్ష్మి, ఎంఆర్‌వో రాంచందర్ సమక్షంలో రైస్ మిల్లు నిర్మాణంతో కలిగే సమస్యపై ఆరా తీశారు. అన్ని రకాల అనుమతులున్నందున మిల్లు నుంచి వచ్చే ఉనుక సమస్యకు పరిష్కారం చూపేలా నిర్మాణం ఉండాలని అధికారులు సూచించారు. అలాగే గతంలో ఉన్న పాత రైస్‌మిల్లును ఆనుకొని ఉన్న రోడ్డు పక్కన రైతులు ఉనుక సమస్యపై అధికారులను ఆశ్రయించగా, శనివారం తౌడు, ఉనుక సమస్య తలెత్తకుండా ఎతైన ప్రహారిని నిర్మించాలని ఆదేశించి, అందుకు సంబంధించి హద్దులు నిర్ణయించారు.

ముఫ్ట్ బిజిలీని వినియోగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8 : సౌర శక్తి పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన పథకాన్ని వినియోగించుకోవాలని సెస్ ఎండీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకునేందుకు దరఖాస్తుదారుడు భారతీయ పౌరుడై ఉండాలని, సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకునేందుకు అనువైన పైకప్పు ఉన్న ఇంటిని కలిగి ఉండాలి, ఇంటికి చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్‌తో పాటు ఆ కుటుంబ సౌర ఫలకాలను మరే ఇతర సబ్సిడీని పొంది ఉండకూడదని తెలిపారు. ఆసక్తి గల వినియోగదారులు నేషనల్ పోర్టులో నమోదు చేసుకోవాలి, రాష్ట్ర విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఎంచుకోవాలి, నేషనల్ పోర్టల్ గృహాలకు తగిన సిస్టమ్ పరిమాణాలు, ప్రయోజనాల కాలిక్యులేటర్, విక్రేత రేటింగ్, తదితర సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. వినియోగదారులు తాము ఇన్‌స్టాల్ చేయాలనుకుంటున్న రూప్ టాప్ సోలార్ యూనిట్ విక్రేత బ్రాండ్‌ను ఎంచుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

గ్రంథాలయాన్ని ఎన్నికల అవసరాలకు వినియోగించొద్దు

వేములవాడ, ఫిబ్రవరి 8: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రంథాలయాన్ని ఎన్నికల అవసరాలకు వినియోగించవద్దని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన గ్రంథాలయం వద్ద మాట్లాడుతూ, గ్రంథాలయాన్ని ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభుత్వ అధికారులు వినియోగింటారని తెలిసి నిరుద్యోగ యువతీయువకులు ఆందోళన చెందుతున్నారన్నారు. 1.45 కోట్లతో నిర్మించిన ఈ భవనాన్ని పేద విద్యార్థులు యువతీయువకుల అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా మంది ఇక్కడ పోటీ పరీక్షల సిద్ధమవుతున్నందున అలాంటి ఆలోచన ఉంటే ప్రభుత్వ అధికారులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్వీ నాయకులు తుమ్మల దిలీప్, ఫార్వేజ్, గణేశ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

కనగర్తిని సందర్శించిన జిల్లా ప్రోగ్రాం అధికారులు

చిన్నారి శ్రీమేధ ఇంటి వద్ద పరిశీలిస్తున్న జిల్లా వైద్యులు

కోనరావుపేట, ఫిబ్రవరి 8: మండలంలోని కనగర్తి గ్రామంలో వీధి కుక్కలతో సోకిన వైరస్ వల్ల చిన్నారి శ్రీమేధ బాధపడుతుండగా జిల్లా ప్రోగ్రాం అధికారులు సందర్శించారు. గ్రామంలోని పరిసరాప్రాంతాలు తిరుగుతూ జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించారు. ప్రజలు ఆందోళన చెందకుండా ఉండాలని పలు సూచనలు చేశారు. అలాగే కోనరావుపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు వైద్యులు సంపత్‌కుమార్, అనిత, రామకృష్ణ, మండల వైద్యాధికారి వేణుమాధవ్, సీహెచ్‌వో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

వేములవాడ, ఫిబ్రవరి 8 : బోయినపల్లి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు శనివారం ఎస్సై పృథ్వీదర్ గౌడ్ తెలిపారు. వేములవాడ పరిధిలో ఇసుక రవాణా చేయడానికి అనుమతులు పొందినా ట్రాక్టర్ యజమానులు సమయం గడిచిపోయిన తర్వాత బోయినపల్లి మండలం అనంతపల్లికి ఇసుక అక్రమంగా రవాణా చేసినట్లుగా గుర్తించి, కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. అనుమతులు లేకుండా మండలంలోకి అక్రమంగా ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్ డ్రైవర్ సుల్తాన్ ఈశ్వర్, ట్రాక్టర్ యజమాని మొగిలి సాయిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ప్రకటనలో తెలిపారు.

గీత కార్మికుడు మృతి

కోనరావుపేట, ఫిబ్రవరి 8: మండలంలోని నిమ్మపల్లికి చెందిన దొంతరవేణి రాజరాం (72) గీతకార్మికుడు కుల వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారీగా కుల వృత్తిలో భాగంగా శుక్రవారం కల్లు గీసేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, తాడు ఎక్కి క్రింద ఉన్న పొలంలో పడిపోయి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా దవాఖనకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని చెప్పడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుమారుడు సాయి కృష్ణ తన తండ్రి ఆనారోగ్యంతోనే మృతిచెందడాని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

పంటలకు నీరు ఇవ్వాలి : ఎమ్మెల్యే

వేములవాడ, ఫిబ్రవరి 8(బోయినపల్లి): వేసవికాలంలో పంటలకు నీరు అందించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. శనివారం బోయినపల్లి మండలం వరదవెల్లి కాల్వ వద్ద ఆయన నీటిని పరిశీలించారు. మండలంలోని జగ్గారావు పల్లె గ్రామ రైతులు తమకు నీరు విడుదల చేయాలని ఎమ్మెల్యేను కోరగా, ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా పంటలు ఎండిపోకుండా తక్షణమే నీటిని అందించాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తికి జరిమానా

చందుర్తి, ఫిబ్రవరి 8: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో 132 సర్వే నంబర్‌లో అక్రమంగా మట్టి తరలించిన రైతు మల్లయ్యకు రూ.11వేల జరిమానా విధించినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు, ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా, జరిమానా విధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.

నాటు బాంబు స్వాధీనం : వ్యక్తి రిమాండ్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని వెంకట్రావుపేటలో 'నాటు బాంబుల కలకలం' శీర్షిక ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. కాగా, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేసి, నిందుతుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకట్రావుపేటకు చెందిన గురుక ఎల్లయ్య పంట పొలం వద్ద ట్రాక్టర్ ఉంచి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ సైలెన్సర్‌లో నాటు బాంబు పెట్టి వెళ్లారు. తిరిగి ఎల్లయ్య ట్రాక్టర్ దగ్గరకు వెళ్లి ఆన్ చేయగా, సైలెన్సర్ నుంచి నాటు బాంబు పేలింది. దీంతో భయంధోళన చెందిన ఆయన తనకు నష్టం కలుగించాలనే నాటు బాంబు అమర్చినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా, అదే గ్రామానికి చెందిన మానుక మహిపాల్ నాటుబాంబు అమర్చినట్లు గుర్తించారు. ఆయనను పట్టుకుని విచారించగా, తానే నాటుబాంబును అమర్చినట్లు తెలుపగా, నాటు బాంబులు స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 8: రెడ్డి కులస్తులను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం గణేశ్ నగర్ అధ్యక్షుడు హన్మాండ్ల జనార్దన్‌రెడ్డి సంఘ సభ్యులతో కలిసి శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సందర్భంగా ఒక్క వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్ర పూరితంగా దుర్భాషలాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

ధర్మపురి, ఫిబ్రవరి 8: ధర్మపురి పట్టణ శివారులోని ఓ వ్యవసాయ బావిలో ప్రమాదశాత్తు పడి ఒకరు మృతి చెందారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలం ఈదులలింగంపేట గ్రామానికి చెందిన ఎండీ హమీద్(35) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం ధర్మపురిలో సంగి లక్ష్మణ్ ఇంటికి పెయింటింగ్ వేయడానికి వచ్చాడు. సాయంత్రం 4 గంటల సమయంలో బహిర్భూమికని తోటి పెయింటర్లకు చెప్పి పట్టణ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మూర్ఛరావడంతో బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. హమీద్ అన్న నసీరొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్: 180 గ్రాములు స్వాధీనం

రాంనగర్ ఫిబ్రవరి 8: కరీంనగర్ జిల్లా కేంద్రలోని జ్యోతినగర్‌లో ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన రేవంత్ కుమార్, ధర్మారం మండలం నందిమేడారానికి చెందిన బీ అభిరామ్, సుల్తానాబాద్ మండలం నీరుకుళ్లకు చెందిన పీ నాగరాజు కలిసి గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో దాడులు చేశారు. ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి, 183 గ్రాముల ఎండు గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, రెండు స్పోర్ట్స్ బైక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఎక్సైజ్ అర్బన్ స్టేషన్‌లో అప్పగించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుల్స్ కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, సంతోష్‌సాయి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చొప్పదండి, ఫిబ్రవరి 8 : చొప్పదండి పట్టణంలోని విజయనగరం కాలనీకి చెందిన సామల తిరుపతి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. చొప్పదండి ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. సామల తిరుపతి అత్తమ్మ హుస్నాబాద్‌లో మృతిచెందగా, కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రహరీ గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా, ఇంటి తలుపు తాళం పగలగొట్టి కనిపించింది. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా హాల్‌లో, బెడ్రూంలో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్రూంలోని బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలు, కొంత నగదు కనిపించలేదు